ఓం శ్రీ సాయిరాం

భగవాన్ శ్రీ సత్యసాయి సేవాసంస్థలు

యువజన విభాగము - ఆంధ్రప్రదేశ్

# ప్రేమ వాహిని

(సంగీత నృత్యనాటిక)


రచన, దర్శకత్వం:

యం.ఎస్. ప్రకాశరావు


ప్రదర్శకులు : శ్రీ సత్యసాయి యువత - ఆంధ్రప్రదేశ్

# ప్రేమవాహిని

(సంగీత నృత్యనాటకం)

ఓం శ్రీ సాయిరాం

ప్రేమమాతృమూర్తి భగవాన్ దివ్య పాదారవిందాలకు ఆంధ్రప్రదేశ్ యువత శతకోటివందనాలు

## నివేదన:

స్వామీ:

ఇది కథ కాదు. యదార్ధ గాథ. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాజిల్లా, తాళ్ళపాలెం మండలం సత్రవపాలెం మరియు గిరిపురం పరిసర గ్రామాలలో, ప్రకాశం జిల్లా నల్లమల కొండలలో టేకులపెంట, గుంతపల్లి, మెట్టుపల్లి, పాయలపల్లి గ్రామాలలో త్రాగడానికి మంచినీరు లేక, తలదాచుకోడానికి ఇళ్ళు లేక, ఆ గ్రామ ప్రజలు పడే వేదనకు శ్రీ సత్యసాయి ప్రేమవాహిని, వారిపై ప్రవహించి, అమృతప్రేమ కురిపించి, వారికి త్రాగడానికి మంచినీరు అందించి, నివసించడానికి చక్కని ఇళ్ళు నిర్మించి, వారి కన్నీరు తుడిచి, ఆవేదనను తొలగించి వారి పిల్లల్ని సంస్కారజ్యోతులుగా తీర్చిదిద్ది వారి జీవితాలలో వెలుగు నింపుతున్న అపురూప సంఘటనలకు నిలువెత్తు దర్పణమే

# ప్రేమవాహిని

(సంగీత నృత్యనాటకం)

స్వామి అర్ఘ్య పాదారవిందాల వద్ద పూజా కుసుమంగా సమర్పిస్తున్నారు

స్వామీ!

దయతో చూడండి. ప్రేమతో ఆశీర్వదించండి.

# ప్రేమవాహిని

(సంగీత నృత్యనాటకం)

**పాత్రలు :**

| | |
|---|---|
| సారధి | శరభయ్య |
| రాజు | ఈశ్వర్ |
| సుందరం | రామయ్య |
| హరి | తిరుమలయ్య |
| ఈశ్వరమ్మ | వెంకటయ్య |
| సత్య | రమణ |
| పెదవెంకమరాజు | గ్రామస్తులు |
| విశ్వనాధం | డాక్టర్ |

సేవాదళ్ సభ్యులు

**పాటలు :**

1. అందరి దేవుడు సాయిరాముడు
2. కంటిపాపలా కరుణకాచేది
3. ప్రతిరెమ్మలోన ప్రతికొమ్మలోన

**పద్యాలు :**

1. ప్రేమవతార శ్రీపీఠమ్ముగా గొమ్ము
2. సర్వసౌఖ్యంబులు చేకూర్చుధనమన్న
3. బంగారు కిరణాలు గంగావతరణాలు

**శ్లోకం :**

1. శ్రీశైలనాధం సకలనిర్గుణమద్వితీయం

# ప్రేమవాహిని

(సంగీత నృత్యనాటకం)

రచన:- ఎమ్.ఎస్.ప్రకాశరావు

సారధి : సీ॥ ప్రేమావతార! శ్రీపీఠమ్ముగా గొమ్ము
ఆనందహృదయ సింహాసనంబు
పర్తి పరంధామ పాద్యమ్ముగా గొమ్ము
ఉత్ఫుల్ల నేత్ర భాష్పోదకంబు
పురుషోత్తమా జపాపుష్పమ్ముగా గొమ్ము
నవ్యవికాస మానస సుమంబు
వేదాంత వేద్య నైవేద్యముగా గొమ్ము
పరిపూర్ణ దివ్యజీవన ఫలంబు
పుణ్యఫలదాయి మహిట్యత విభూతిదాయి
ముక్తివరదాయి భక్త్యనుభూతిదాయి
నిత్యసుఖదాయి నాకు సాన్నిధ్యమిమ్ము
చందనసుగంధ వందనాంజలులు తండ్రి

రాజు : సారధీ

సారధీ : రాజూ! మీరా, స్నేహితులందరూ కలిసివచ్చారు. ఏదైనా విశేషమా

రాజు : ఇన్నాళ్ళూ కలిసి చదువుకున్నాం. అన్నదమ్ముల్లా మెలిగాం. ఇప్పుడు ఎవరిదారిన వారు ఉద్యోగాల్లోనో వ్యాపారాల్లోనో స్థిరపడతాం. అందుకే నాలుగు రోజులపాటు నలుగురం కలిసి గడిపి వెళదామని వచ్చాం.

సుందరం : అవును సారధీ ఉద్యోగ వ్యాపారాల్లో స్థిరపడ్డాక మనమిలా కలుసుకోవడానికి అవకాశం రాకపోవచ్చు. అందుకే వచ్చాం.

సారధి : చాలా సంతోషం సుందరం, ఈ నాలుగు రోజులూ మీకు నాకూ మరచిపోలేని మంచి అనుభవాన్నీ ఇచ్చేరీతిలో గడుపుదాం. ఇంతకీ మీ భవిష్యత్ప్రణాళిక ఏమిటి?

రాజు : ఇంతవరకూ నాన్నగారు నడుపుతున్న ఎక్‌పోర్ట్స్, ఇంపోర్ట్స్ కంపెనీ బాధ్యతల్ని స్వీకరించి, ఆధునికత మేళవించి అతి త్వరలో కనీసం సంవత్సరానికి పదికోట్లు లాభాల్ని ఆర్జించగల కంపెనీగా తీర్చిదిద్దుతాను. దానికోసం అహూరాత్రులు

కష్టపడతాను.

సారథి : గుడ్ సుందరం. మరి నువ్వు

సుందరం : నేనా బాదరబందీలు పడదల్చుకోలేదు సారథీ. రెండు మూడు కంపెనీలకి అప్లికేషన్ పెట్టాను. నా అర్హతకి తగిన ఏదో ఒక ఉద్యోగం తప్పక వస్తుంది. మంచి జీతం వచ్చే కంపెనీలో చేరి కడుపులో చల్ల కదలకుండా హాయిగా గడపదల్చుకున్నాను.

సారథి : మరి నీమాటేమిటి హరి

హరి : 'చిన్ని బొజ్జకు శ్రీరామరక్ష' అనుకుంటూ ఈ దేశంలోనే ఉండిపోదలచ్చుకోలేదు నేను. ప్రపంచం అంతా తిరగాలి. మంచి మల్టినేషనల్ కంపెనీలో పెద్ద పదవినలంకరించి ఈ రోజు డిల్లీ, రేపు ప్యారిస్, ఎల్లుండి లండన్ ఆ తర్వాత న్యూయార్క్, సిడ్నీ అలా రోజుకో దేశం తిరిగే ఉద్యోగం చేస్తాను. కోట్లకు పడగలెత్తుతాను.

సారథి : విష్ యూ ఆల్ ది బెస్ట్. అయితే ఇంతకు మించి ఇంకేమీ మీరాలోచించడం లేదా?

రాజు : ఇంకేం ఆలోచించమన్నావు. ఓ ఇల్లూ, ఇల్లాలూ, కార్లు అంటావా. మన సంపాదనతో అవి శ్రమపడకుండానే అమరిపోతాయి.

సారథి : అది కాదు. మనలా చదవుకోడానికి అవకాశం లేనివారూ, విధివంచితులై పేదరికాన్ని అనుభవిస్తున్నవాళ్ళూ, కష్టాల కడలిలో తేలియాడుతున్నవాళ్ళూ, అర్హత ఉండీ అవకాశం లేనివాళ్ళూ, వ్యాధిగ్రస్తులైనా చికిత్సకోసం ధనం లేక బాధపడేవాళ్ళూ, తల్లీ తండ్రీ లేని అనాధలుగా అలమటించే వాళ్ళూ మనచుట్టూ ఎందరో ఉన్నారు. వాళ్ళూ మన సమాజంలో భాగస్వాములే. మరి వారిని ఆదుకోవడం మన ధర్మం కాదా?

సుందరం : ఆ! మన ధర్మమే. ఓ వందో, ఏభయ్యో విరాళం ఇస్తాం.

సారథి : నీ విరాళంతో ఒకరికో ఇద్దరికో తాత్కాలికంగా మేలు జరగొచ్చు. కాని ఆ విరాళాలు వేలాదిమంది కన్నీటిని ఆపగలవా? లక్షలాది మంది వేదనను తొలగించగలవా?

హరి : తొలగించలేవు. వాళ్ళ సంగతి ఏ ప్రభుత్వమో చూసుకోవాలి మనకేం సంబంధం.

సారథి : అని భగవాన్ శ్రీసత్యసాయిబాబా వారనుకుంటే ఈ రోజు లక్షలాది మంది గిరిజనులకు త్రాగునీరు లభించేదా! కోట్లాది మందికి వేదవిహితమైన విద్య ఉచితంగా దొరికేదా! లక్షలాది మంది రోగులకు ప్రాణదానం జరిగేదా!

సుందరం : వారు అవతార పురుషులు కనుక చెయ్యగలిగారు. మనమేం చెయ్యగలం.

సారధి : అని సమాజంపట్ల మన బాధ్యత విస్మరిద్దామా? వారధి కట్టడానికి శ్రీరామునికి ఉడుత సహాయం అందించినట్టు మన పరిధిలో మనం సేవ చెయ్యలేమా? చంద్రునికో నూలుపోగులాగా బాబా పాదారవిందాల దగ్గర సేవా కుసుమాల్ని సమర్పించి స్ఫూర్తి పొందలేమా?

రాజు : చెయ్యచ్చునుకో?

సారధి : చెయ్యొచ్చు అనకు రాజూ! చేద్దాం. కోట్లు సంపాదించుకోవాలనే మీ కలల్ని సాకారం చేసుకోండి. కాదనను. కాని, ఆ కృషిలో నీతి నియమాల్ని పాటించండి. న్యాయంగా తలెత్తుకుని సగర్వంగా సంపాదించి దానిలో కొంతైనా సాటివారి సాయంకోసం వినియోగించండి. మనచుట్టూ ఉన్న వారిని ఆనందంగా ఉంచగలిగితేనే మనం ఆనందంగా ఉండగలమంటారు మా బాబా. ఇవి నీతులు కావు నిజాలు.

సుందరం : అయితే నువ్వేం చెయ్యదలుచుకున్నావు.

సారధి : నేనీ గ్రామంలోనే ఉంటాను. నాన్నగారి వ్యవసాయాన్నే చేపడతాను. పట్టుదల, కృషి ఉంటే ఏ రంగంలోనైనా అభివృధి సాధించవచ్చు. నా సాటి అన్నదాతల కన్నీరు తుడుస్తాను. వారిని సుసంఘటితం చేసి ఎలా పైకి రావచ్చో నేను చేసి చూపిస్తాను. మౌలిక సదుపాయాల్లేని ఎన్నో గ్రామాలకు నాతోటి సాయి సోదరులతో వెళ్ళి బాబా ఆదేశానుసారం గ్రామాభివృద్ధికి నా చేతననైన సేవ చేస్తాను. ఈ మార్గంలోనే నా జీవితం ధన్యం చేసుకుంటాను.

హరి : ఈ చిన్ని వ్యవసాయంతో ఇవన్నీ చెయ్యగలవా?

సారధి : మనసుంటే ఉంటుంది హరీ! సత్సంకల్పం ఉంటే దైవసహాయం తప్పక లభిస్తుంది. సేవ చెయ్యడానికి ధనం కన్న ప్రేమధనం ముఖ్యం ప్రేమను మించిన ధనం. ప్రేమను మించిన జ్ఞానం లేవంటారు మా బాబా.

సుందరం : ఇంత చదువూ చదివి ఈ చిన్ని వ్యవసాయంలో స్థిరపడితే నీ మీద, నీ సంపాదన మీద కోటి ఆశలు పెట్టుకున్న మీ వాళ్ళూరుకుంటారా.

సారధి : మా తల్లిదండ్రులు చూపించిన మార్గమే ఇది. వారు బాబాని దైవంగా విశ్వసిస్తారు. మమ్మల్ని వారి పాదాల దగ్గరకు చేర్చారు. వారి బోధనల్ని విని ఆచరించమన్నారు. జీవితం సార్ధకం చేసుకోమన్నారు. ఇంతకన్నా గొప్ప వారసత్వాన్ని ఏ తల్లిదండ్రులివ్వగలరు.

రాజు : మా ఇళ్ళలో ఎప్పుడూ గొప్ప చదువులు చదవాలి, ఉన్నతోద్యోగాలు చెయ్యాలనీ, కోట్లు ఆర్జించాలనీ చెప్పేరు తప్ప ప్రేమా – సేవా అనే మాటలు

మాకు చెప్పలేదు సారథీ.

సారథి : అది బాధ్యతారాహిత్యం రాజూ. ధన, జన, బలాన్ని చూసి గర్వించవద్దన్న ఆదిశంకరుడు ఈ దేశంలోనే పుట్టాడు. త్యాగభూమి యోగభూమియైన భరతభూమి నా కన్నతల్లి అని సగర్వంగా విశ్వానికి చాటిన వివేకానందుడూ ఈ గడ్డపైనే జన్మించాడు. ధనాన్ని తృణీకరించి భగవత్సాక్షాత్కారాన్ని పొందిన మహాభక్తులకు పుట్టినిల్లు ఈ దేశం. అన్ని మతాలను అక్కున చేర్చుకున్న మాతృమూర్తి ఈ భూమి. ఈ దేశం సత్యానికి స్వాగతం పలికింది, న్యాయానికి కంకణం తొడిగింది. త్యాగానికి మణిమకుటం పెట్టింది. ఈ దేశం గాలిలో సత్యం ఉంది, ధూళిలో ధర్మం ఉంది అని చెప్పిన మా బాబా ఈ దేశంలోనే అవతరించారు. ప్రతీ తల్లీదండ్రీ తమ బిడ్డలకు ఈ అద్భుత సంస్కృతికి వారసులమని చెప్పమని ఆదేశించారు. ఇక సంపాదనంటావా

పద్యం : సీ॥ సర్వసౌఖ్యంబులు చేకూరుధనమన్న
ఎంతవరకది నీ చెంతనుండు
ఘనమైనపదవి చేకూర్చు ధనమన్న
ఎంతవరకది నీ దగ్గరుండు
ఆనందమదియేదో అందించు ధనమన్న
ఎంతవరకది నీ సొంతమగును
కష్టముల్ పొగొట్టి శాంతినిచ్చునటన్న
ఎన్ని కష్టములను ధనము తీర్చు
శాశ్వతంబైన సుఖమును కోరకుండ
ధనముధనమంచు జీవితం ధారపోసి
ఏమి సాధించితివి నీవు జగతియందు
ఎంతవరకుందువీ జగత్తెంతవరకు

హరి : నువ్వు చెప్పిన మాటల్లో నిజం ఉంది సారథీ. అయితే ఈ సేవాస్ఫూర్తి నీలో కలగడానికి ఇంకేమైనా కారణం ఉందా?

సారథి : ఉంది. అదే "బాబా జీవితం". పసితనం నుంచీ వారు చూపిన ప్రేమా, కరుణా, సేవాభావం వింటూ నా గుండె కరిగి కన్నీరైంది. ఇంత అద్భుతమూర్తినీ అవతార పురుషుణ్ణీ దైవంగా కొలుస్తూ సేవాభావాన్ని నిత్యకృత్యంగా చేపట్టకపోతే నా జీవితం వృధా అనిపించింది. వారి అమృతప్రేమ నాకు స్ఫూర్తి. ఆ కథ చెబుతాను విను.

(ప్రేమముదిత మన్‌సె కహెూ రామ్ రామ్ రామ్" నేపథ్యంలో వినిపిస్తూ ఉంటుంది)

ఈశ్వరమ్మ : సత్యా, సత్యా

సత్య : అమ్మా! పిలిచావా.

ఈశ్వరమ్మ : ఆడి పాడి ఎంత అలసిపోయావో. అన్నం తిను నాన్నా. రా ఆ! అను నేను గోరుముద్దలు పెడతాను.

సత్య : ఆ! అంటాను. పధ్నాలుగు భువనాలు కనిపిస్తే ఆశ్చర్యపోవు కదా!

ఈశ్వరమ్మ : ఆశ్చర్యపోన్లే! ఎన్ని మాటలు నేర్చావురా. సుబ్బమ్మ అన్నట్లు నువ్వు చిలిపికృష్ణుడివే. నోరుతెరువు.

పేదవాడు : అమ్మా! మాధవకబళం తల్లీ

సత్య : ఒక్క క్షణం ఉండమ్మా (పరుగెత్తి వీధిలోకి పోతాడు, మళ్ళీ తిరిగివచ్చాడు) అమ్మా! పాపం ఎవరో పేదవాడు ఆకలితో బాధపడుతున్నాడమ్మా. అమ్మా వాడు నీ బిడ్డలాంటి వాడే కదా వాడికి అన్నం పెట్టనా అమ్మా!

ఈశ్వరమ్మ : పెట్టు సత్యా (గిన్నెతో పరుగెత్తుతాడు సత్య మళ్ళీ తిరిగివచ్చి)

సత్య : అమ్మా, ఆ పేదవాడు అన్నం తింటుంటే నాకెంతో ఆనందంగా ఉందమ్మా, ఇలా పేదవారికి రోజూ అన్నం పెట్టనా

ఈశ్వరమ్మ : నాన్నా! నీదెంత జాలిగుండెరా.

సత్య : ఇతరుల కష్టాలు చూసి కన్నీరు కార్చే కరుణామూర్తివి నీ కొడుకుని, ఆ జాలీ కరుణా నాకబ్బకుండా ఉంటాయా అమ్మా

ఈశ్వరమ్మ : నా బంగారు తండ్రివి (కౌగలించుకొంటుంది)

పెదవెంకమరాజు : సత్యా! ఆ పేదవాడికి అన్నం నువ్వే పెట్టావా

సత్య : నేనే పెట్టారు నాన్నగారూ.

పెదవెంకమరాజు : సత్యా మనది పేదకుటుంబం నువ్విలా దానధర్మాలు చేస్తే ఎలాగయ్యా?

సత్య : మీ సొత్తు దానం చెయ్యలేదు నాన్నగారూ. నా వంతు అన్నాన్నే ఇచ్చాను. ఈ పూట నాకన్నం అఖ్ఖరలేదు.
(విషాద సంగీతం నేపథ్యంలో వినిపిస్తుంది)

ఈశ్వరమ్మ : సత్యా, సత్యా (తడిమి భుజాలమీద కాయలు చూస్తుంది) నీ భుజాలు కమిలిపోయి, కాయలు కాసేయి, ఎవరన్నా కొట్టారా?

సత్య : నన్నెవరూ కొట్టలేదమ్మా

ఈశ్వరమ్మ : మరి నీ భుజాల మీద ఈ కాయలేమిటిరా

సత్య : నేనే దూరపు బావి నుండి కావడితో నీళ్ళుమోసి అందరికీ పంచుతున్నానమ్మా

ఈశ్వరమ్మ : పసివాడిని నువ్వు కావడితో నీళ్ళు మోస్తున్నావా.

సత్య : మరి అందరి దాహం తీర్చాలి కదమ్మా

ఈశ్వరమ్మ : సత్యా! పసివాణ్ణి నేను కావడితో నీళ్ళు మోయలేనని చెప్పలేకపోయావా

నాయనా! నీ బాధచూసి నేను భరించగలనా?

సత్య : అమ్మా. మానవాళికి సేవచేయడానికే పుట్టినవాణ్ణి, కావడితో నీళ్ళు మోయలేనని ఎలా చెప్పనమ్మా

ఈశ్వరమ్మ : సత్యా! నువ్వు మనిషివి కాదురా, దేవుడివి

(విషాద సంగీతం నేపథ్యంలో వినిపిస్తుంది)

ఈశ్వరమ్మ : సత్యా

సత్య : ఏమమ్మా

ఈశ్వరమ్మ : వేలాది మంది నిన్ను దేవుడని కొలుస్తున్నారని శేషమ చెప్పాడు. నిజమేనా

సత్య : అన్నగారు అసత్యం చెప్పడు కదమ్మా

ఈశ్వరమ్మ : వాళ్ళంతా నీ కోసం ఆశ్రయం నిర్మించాలనీ, ఆలయం కట్టాలనీ అనుకుంటున్నారుట.

సత్య : అలాగా అమ్మా

ఈశ్వరమ్మ : అప్పుడీ అమ్మని వదలి వెళ్ళిపోతావా సత్యా

సత్య : వెళ్ళిపోతానేమోనని దిగులుగా ఉందా అమ్మా

ఈశ్వరమ్మ : నిన్ను నమ్మిన భక్తులే నిన్ను వదలి ఉండలేకుండా ఉన్నారే. కన్నతల్లిని నేను ఉండగలనా?

సత్య : ఉండలేవమ్మా. నేనంటే నీకు పంచప్రాణాలని నాకు తెలుసమ్మా

ఈశ్వరమ్మ : నీకు తెలుసు కదా, అందుకే ఈ పుట్టపర్తిని వదలి వెళ్ళనని నాకు మాటియ్యి సత్యా.

సత్య : అమ్మా! జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి అని దైవహక్కు. అందుకే నిన్నూ ఈ పుట్టపర్తినీ ఎన్నడూ వదలి వెళ్ళనమ్మా. త్వరలో ఈ పుట్టపర్తిని కలియుగ కైలాసంగా, నవయుగ వైకుంఠంగా తీర్చి దిద్దుతానమ్మా. నీకే కాదు యావత్ప్రపంచానికీ నేనీ వరం ఇస్తున్నావమ్మా.

❄❄❄

సారధి : రాజూ! మా స్వామికి పేదలంటే ఎంత ప్రేమో, కన్నతల్లీ, జన్మభూమి పట్ల ఎంత గౌరవమో తెలిసిందా. నాకే కాదు మా యువత అందరికీ వారి జీవితమే స్ఫూర్తి, వారి మాటే వేదవాక్కు, వారు చూపిన ప్రేమబాటే మాకు

రాచబాట. వారి పాదాలను నమ్ముకుంటే మనిషిగా మన జీవితం సార్థకం చేసుకోగలుగుతాం.

సీ॥ బంగారు కిరణాలు గంగావతరణాలు
మా'స్వామి' చరణాలు మధుకణాలు
అజ్ఞానహరణాలు ఆనందభరణాలు
మా'సత్య' చరణాలు మణిగణాలు
కాంతి ప్రసరణాలు శాంతి సంక్రమణాలు
మా'సాయి' చరణాలు మంత్రణాలు
దివి కలంకరణాలు భువికి వితరణాలు
మా'బాబ' చరణాలు మార్గణాలు
చారుధార్మిక మంగళతోరణాలు
మత్సర గ్రస్త రాక్షస మారణాలు
పరమ తత్వార్ధ వరభద్ర వారణాలు
ప్రభువు చరణాలు శరణాలు రక్షణాలు.

రాజు : నువ్వు చెబుతుంటే వారిని దర్శించాలనీ, వారి సేవలో పాల్గొనాలనీ అనిపిస్తుంది సారథీ.

సారథి : ఒక్కమారు ఆ సేవా సౌభాగ్యాన్ని రుచి చూడండి. గ్రామసేవలో పాల్గొందాం. రండి.

❄❄❄

విశ్వనాథం : శ్లో॥ శ్రీశైలనాథం సకలనిర్గుణ మద్వితీయం
కేదారనాథం అపరాజిత మప్రమేయం
శ్రీవైద్యనాథం సకలనిష్కలమాత్మరూపం
వారాణసీ పురతిం భజవిశ్వనాథం
భజవిశ్వనాథం... భజవిశ్వనాథం

శరభయ్య : ఏం విశ్వనాథంగారూ మరీ అంతభక్తితో ప్రార్థిస్తున్నారు. దేవుడితో అర్జంటుగా అవసరమేమైనా వచ్చిందా.

విశ్వనాథం : "అవసరం ఉంటేనే దేవుణ్ణి ప్రార్థించడం" నాకలవాటు లేదు.

శరభయ్య : అహా! అక్కడికి తమరొక్కరే భక్తులైనట్టూ మేం కానట్టూ. చూడండి, అరవై ఆలయాలకి అష్టోత్తరపూజకి డబ్బు కట్టాను. అర్నెల్లకోసారి ఏదో కొండెక్కుతాను.

వెయ్యిన్నూట పదహార్లిచ్చి ఎందరికో పాదపూజలు చేశాను. ఇదంతా భక్తి కాదంటారా?

విశ్వనాధం : మీరు చేసేవి మీ కోసం. నా ప్రార్ధన నా కోసం కాదు. ఈ గ్రామప్రజలకోసం ఏ సమస్యాలేకుండా హాయిగా ఆనందంగా ఈ గ్రామప్రజలు ఉండాలని నా కోరిక.

శరభయ్య : ఇంతకీ ఈ గ్రామనికీ, ఇక్కడి ప్రజలకీ వచ్చిన ఉపద్రవం ఏమిటండీ.

విశ్వనాధం : 'అలో లక్ష్మణా' అని ఆరుకిలోమీటర్లు మోసుకుని తెచ్చుకుంటే కాని మంచినీళ్ళు లేవు. తెచ్చుకోలేక ఇక్కడి నీరు త్రాగితే దీర్ఘరోగాలతో బాధపడుతున్నారు. సరైన బడిలేక పిల్లలు నిరక్షరాస్యులై కూలీనాలీ చేసుకుంటున్నారు, బంగారం లాంటి భవిష్యత్తును అంధకార బంధురం చేసుకుంటున్నారు. మంచి చెప్పే నాధుడు లేక యువకులు జులాయిగా తిరుగుతున్నారు. డాక్టర్లు రాక ఆస్పత్రి మూతపడి ప్రజలు రోగాల పాలవుతున్నారు. "ఈ పరిస్థితిని మార్చు భగవంతుడా! ఈ గ్రామాన్ని చిరునవ్వుతో కళకళలాడేటట్లు చెయ్యి" భగవంతుడా అని వేడుకుంటున్నాను.

శరభయ్య : ఇవన్నీ నాకు తెలియవుటండీ. నీటి వసతి లేదన్నారు. ఎంతమంది గ్రామప్రజలు నీరు మోసి కూలి సంపాదించుకుంటున్నారు. నీటి సమస్య ఉండబట్టి కదా నిరుద్యోగ సమస్య తీరింది. నీటికోసం ఆరు కిలోమీటర్లు నడవాలన్నారు. ఆరు కిలోమీటర్ల నడకంటే ఆరోగ్యానికి రాచబాటన్నమాట. బడిలేదన్నారు. చదువుకున్న వాళ్ళంతా డిగ్రీలు చేతపట్టుకుని ఉద్యోగాల కోసం ఊళ్ళు తిరుగుతూ ఉంటే మన కుర్రకారంతా హాయిగా కూలి చేసుకుంటూ స్వంత ఊళ్ళోనే దర్జాగా బ్రతుకుతున్నారు. స్కూలు లేకపోబట్టి కదా కూలీగానైనా బ్రతుకుతున్నారు. ఇక యువకులంతా బలాదూరుగా తిరుగుతూంటే లోకజ్ఞానం సంపాదించుకుని కాలం కలిసొస్తే చేరచ్చు పదవులంకరించవచ్చు. దానికి చదువులో నిమిత్తం లేదు కదా. ఇక డాక్టర్లు రాక అనారోగ్యం పెరిగితే జనం తగ్గి జనాభా సమస్య పరిష్కారం అవుతుంది. – ఏమంటారు.

విశ్వనాధం : శరభయ్యగారూ సాటి ప్రజల దీనస్థితిని ఇలా సమర్ధించుకోడానికి మీకు సిగ్గువెయ్యడం లేదూ. కాలే కడుపుల ఆవేదన కడుపు నిండిన మీకెలా అర్ధమవుతుంది.

శరభయ్య : వాళ్ళ బాధలు నాకు తెలియకపోతే గ్రామంలో మంచినీళ్ళ దుకాణం

పెడతానా.

విశ్వనాధం : దేవుడిచ్చిన మంచినీటిని కూడా అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు.

శరభయ్య : సంపాదించే నేర్పు లేక నా సంపాదన చూసి ఈర్ష్యపడుతున్నారు.

విశ్వనాధం : ధనం! న్యాయంగా ధనాన్ని అనేక విధాల సంపాదించవచ్చు. దానికోసం పేదవారి పొట్ట కొట్టనక్ఖర్లేదు.

శరభయ్య : అంటే నీటి వసతి లేకుండా నేను చేశానా.

విశ్వనాధం : మీరే కాదు ఈ సత్రవపాలెంలో విద్యావంతులమనుకుంటున్న అందరం చేశాం. ఉప్పు నీటిని మంచినీటిగా మార్చే పరికరాలు పాడై గ్రామస్తులు త్రాగడానికి గుక్కెడు నీళ్ళులేక కటకటలాడుతుంటే చూస్తూ ఊరుకున్నాం. చదువూ సంధ్యా లేక పిల్లలు నిరక్షరాస్యులై తిరుగుతూ ఉంటే ఏమీ పట్టనట్టు ఉండిపోయాం. ఇది బాధ్యతారాహిత్యం కాదా.

శరభయ్య : ఆహా! ఇప్పుడు మీ ప్రార్థన విని వెంటనే శ్రీమన్నారాయణమూర్తి శంఖచక్ర గదా పద్మాలతో ప్రత్యక్షమై "వత్సా! నీ భక్తికిమెచ్చి నీ గ్రామానికి మంచినీటి పథకం చక్కని బడి అనుగ్రహిస్తున్నా న్నా" అని వరమిస్తాడు. ఈ గ్రామంలో అందరి ముఖాల్లో ఆనందం తాండవిస్తుంది. అది చూసి మేమంతా ఆనందంతో గంతులేస్తాం.

విశ్వనాధం : భగవిద్విశ్వాసాన్ని గేలి చేయకండి. భగవంతుడు ఏ రూపంలో ఎలా మన ప్రార్థన మన్నించి ఆశీర్వదిస్తాడో మనకేం తెలుసు.

( సాయి యువత నృత్యం చేసుకుంటూ ప్రవేశిస్తారు)

పాట

పల్లవి. అందరి దేవుడు సాయిరాముడు
అభయమిచ్చి కాపాడే దేవాదిదేవుడు ॥అందరి॥

చ. 1 నిర్మల ప్రేమమూర్తి సాయిరాముడు
నిరాకార పరబ్రహ్మ సాయిరాముడు
సర్వదేవతాతీతుడు సాయిరాముడు ॥అందరి॥

చ. 2 ధనముకు లొంగడు పూజకు పొంగడు
గుడిగోపురాలకు అసలే అందడు
సాయీ సాయీ యని నోరారా పలికితే
సాక్షాత్కరిస్తాడు సత్యసాయిరాముడు ॥అందరి॥

చ.3 కులభేదం ఎంచడు మతభేదం చూడడు
మాయామర్మం లేని మనసునియ్యమంటాడు
దీనులకన్నీరు తుడిచి మనసారా సేవిస్తే
దరికి చేర్చుకుంటాడు సత్యసాయిరాముడు ॥అందరి॥
(వైద్య శిబిరానికి ఏర్పాట్లు చేసుకుంటూ ఉంటారు సాయి యువత)

విశ్వనాథం : ఎవరు బాబూ మీరు

సారధి : భగవాన్ శ్రీసత్యసాయిబాబావారి బిడ్డలమండి.

విశ్వనాథం : అంటే కోట్లాది మంది దాహార్తిని తీర్చిన మహనీయుని బిడ్డలా మీరు

ఈశ్వర్ : అవునండీ! ఒక్క దాహార్తిని తీర్చడమేకాదు. లక్షలాది మందికి ప్రాణదానం చేస్తున్న అస్పత్రుల్ని కూడా వారే నిర్మించారు. విద్యార్థుల్ని వివేకానందులుగా మార్చే విశ్వవిద్యాలయాన్ని స్థాపించారు.

విశ్వనాథం : మా గ్రామానికి ఏదైనా పనిపడి వచ్చారా.

ఈశ్వర్ : అవును. మా స్వామి గ్రామసీమలే భారతదేశానికి ఆయువుపట్టని, అక్కడే ఇంకా భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు నెలకొని ఉన్నాయని చెప్పి, ఎన్నో గ్రామాలు ఏ మౌలిక సదుపాయాలూ లేక ప్రజలు ఇబ్బందికి గురవుతున్నారనీ, వారిని ఆదుకుంటాననీ మాట ఇచ్చారు. ఆడి తప్పని శ్రీరామచంద్రమూర్తి మా స్వామి వారు వాగ్దానం చేశారంటే అది జరిగి తీరవలసిందే. ముఖ్యంగా గ్రామాల్ని పీడిస్తున్న సమస్యల్ని శాశ్వతంగా పరిష్కరించమన్నారు.

రామయ్య : ఎంత చల్లని మాట చెప్పారు. శరభయ్యగారూ! "ప్రార్థిస్తే దేవుడు ప్రత్యక్షమై వరమిస్తాడు" అని గేలి చేశారే. ఇదుగో దేవుడు మన గ్రామానికి దిగి వచ్చాడు. చూడండి.

శరభయ్య : ఇదేదో ఆశ్చర్యంగా ఉందే.

ఈశ్వర్ : వారి అనుగ్రహం ఆశ్చర్యంగా ఉంటుంది అన్నా. ఈ గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించాలని వచ్చాం. ఈ గ్రామాంలో ప్రజలు ఎదుర్కొంటున్న ముఖ్యమైన సమస్యలు ఏమైనా ఉంటే చెప్పండి.

విశ్వనాథం : చాలా పెద్ద సమస్యే ఉంది బాబూ. ఉప్పు నీటిని మంచినీటిగా మార్చే పరికరాలు మూతబడి సత్రవపాలెం ప్రాంతంలో పది గ్రామాల ప్రజలు త్రాగడానికి గుక్కెడు మంచినీరు లేక అలమటించి పోతున్నారు. చెట్ట క్రిందనే బడి నడుపుతూ భవనం లేకపోవడంతో పిల్లలు బడికి రాక నిరక్షరాస్యులై

బాలకార్మికులై పోతున్నారు.

సారధి : అలాగా! ఉప్పునీటిని మంచినీటిగా మార్చే 'డీ శాలినేషన్ ప్లాంట్' ని పునరుద్ధరించడానికీ, పాఠశాల నిర్మాణానికీ స్వామి ఆశీస్సులతో తప్పకుండా ప్రయత్నిద్దాం.

రామయ్య : బాబూ బాబాగారి దగ్గరకు పుట్టపర్తి వెళ్ళి మమ్మల్ని ప్రార్థించమన్నారా?

ఈశ్వర్ : చూడండి! అడిగితే వేసేది భిక్ష, అడక్కుండా చేసేది సేవ అంటారు మా బాబా. అమృతప్రేమమూర్తి మా స్వామి. బోస్నియా దేశంలో శరణార్థులకి అడిగితేనే భోజనం పెట్టారా? ఒరిస్సాలో తుఫాను బాధితులకి అర్థిస్తేనే ఇళ్ళు కట్టించి ఇచ్చారా? గుజరాత్‌లో భూకంప బాధితులు కోరితేనే సహాయం అందించారా? మద్రాసు మహానగరానికి ప్రార్థిస్తేనే మంచినీరందించారా? ఈ విశాల విశ్వంలో ఏ ఒక్కరు కన్నీరు చిందించినా వారి కరుణా హృదయం కరిగిపోతుంది. వారి అమృతహస్తం అభయమిచ్చి ఆదుకుంటుంది. విశ్వనాధంగారూ! అడిగితే సహాయం చేసేవారు దాత. అడగకుండా అనుగ్రహించేవాడు భగవంతుడు. ఆ భగవంతుడే మా బాబా.

విశ్వనాధం : చిన్నవారైనా పెద్దమాటన్నారు. మీకు నమస్కారం

సారధి : లేదండి! మేమే మీకు నమస్కరించాలి. మీకు సేవచేసే మహాభాగ్యం మాకు కల్పించారు. త్వరలోనే ఈ నీటి పథకం చేపడదాం.

శరభయ్య : లక్షల్లో ఖర్చు అవుతుందండి మరి.

ఈశ్వర్ : మనసుంటే మార్గం ఉంటుందంటారు మా బాబా. మన సత్సంకల్పం స్వామి ఆశీస్సులూ ఉంటే కరుణా హృదయాలనుంచి కనకవర్షం కురుస్తుంది. ఈ గ్రామంలో దివిజగంగ ప్రవహిస్తుంది. చూస్తూ ఉండండి మీరు.

విశ్వనాధం : భగవంతుడెలా ఆదుకుంటాడో చూశారా.

(సాయి యువత నృత్యం చేస్తుండగా నీటి పథక నిర్మాణం పూర్తవుతుంది)

పాట

పల్లవి. కంటిపాపగా కరుణకాచేది సాయి అనురాగమే
జంటతానుండి ఆదరించేది సాయి అనుబంధమే
బ్రతునకున కర్థము చూపించేది సాయి సంకల్పమే
జతగతానుండి నడిపించేది సాయి ఉత్సాహమే
సాయి మాత మమతా ప్రేమభావచరితా ॥కంటిపాపలా॥

చ.1 ఎన్ని జన్మల కర్మమైన బాధ ఏమిలే
సన్నిధానము చేరియుండగ లోటులేదులే
కలవరపడు మనసే కోరునులే ప్రశాంతి
అలలు అధికమైన దొరకునులే ప్రశాంతి
సాయిమాత మమతా, ప్రేమ భావచరితా ॥కంటిపాపలా॥

చ.2 తప్పటడుగులు వేయు మనలను త్రిప్పును ఈ తల్లి
గొప్పబోధల సారమంతము విప్పును ఈ తల్లి
జయ జయ జయయనరే శుభమనరే ఈ నిముషం
భయమిక లేదనరే ఘనమనరే ఈ బంధం
సాయిమాత మమతా, ప్రేమభావచరితా ॥కంటిపాపలా॥

(సన్నాయిమేళం, వేదఘోష ప్రతిధ్వనిస్తూ ఉంటుంది)

ఈశ్వర్ : అయ్యా! ఈ గ్రామానికి త్రాగడానికి మంచినీరు లేదని తపించినవారూ, మంచినీరందించమని ప్రార్థించిననవారూ మీరు. బాబాపాదాలకి ఈ నీటిపథకాన్ని మీరే అంకితం చెయ్యండి. ఇదుగో ఈ పాఠశాలని మీ చేత్తోనే ప్రారంభించండి.

విశ్వనాథం : స్వామీ! నిన్ను చూడకపోయినా, నిన్ను ప్రార్థించకపోయినా, కనీసం నీ నామాన్ని స్మరించకపోయినా మమ్మల్ని ఆదుకుని ఆదరించావు. సర్వేశ్వరా! సత్యసాయీశ్వర నీ పాదారవిందాలకు ఈ గ్రామాల ప్రజలందరి తరపున శతకోటి వందనాలు.

సారధి : స్వామీ! ఈ సేవా కార్యక్రమాన్ని మీ పాదాలచెంత పూజకుసుమంగా అర్పించే మహాభాగ్యం కల్పించారు మీకు మా కృతజ్ఞతాంజలులు స్వామీ!
జై బోలో భగవాన్ శ్రీసత్యసాయిబాబాజీకి

అందరూ : జై

సారధి : అన్నయ్యగారూ! ఈ మంచినీరు త్రాగుతుంటే మీకేమనిపించింది.

రామయ్య : దాహం వేసినా! గుక్కెడు మంచినీళ్ళు గొంతులో దిగినా, మా పిల్లలు పుస్తకం విప్పి చదివినా బాబాగారే మా కళ్ళ ముందు మెదులుతారు బాబూ.

సారధి : చూశారా! ఆ గ్రామస్తుల ఆనందాన్ని అంచనా వెయ్యగలమా. ఇటువంటి సేవలో పొందే ఆనందానికి విలువ కట్టగలమా.

రాజు : ఇటువంటి సేవ చేయవచ్చునని నేను ఊహించలేదు.

సుందరం : యువకుల్లో ఇంతటి సేవాచైతన్యాన్ని కలిగించగలిగారంటే బాబా వారు

భగవంతుడనడంలో సందేహం లేదు సారథీ.

❄❄❄

(పక్షుల కిల కిలా రావాలతో అడవి వాతావరణం ప్రతిధ్వనిస్తూ ఉంటుంది)

తిరుమలయ్య : ఆ! ఈ గాలి చూస్తే ఇళ్ళెగిరిపోయేలా ఉన్నాదిరా. అన్నా ఈ గాలిలో ఎక్కడికి బయలుదేరావురా.

వెంకటయ్య : లోయలోకి దిగుతున్నాన్రా

తిరుమలయ్య : లోయలోకా? మతిపోయిందా అన్నా! ఈ గాలివాటుకి బండలమీద జారి లోయలో పడతావు జాగ్రత్త

వెంకటయ్య : ప్రాణం పోయినా తప్పదురా.

తిరుమలయ్య : ఏం

వెంకటయ్య : ఇంట్లో అందరికీ గుక్కెడు మంచినీరు గొంతులో దిగాలంటే ఈ కట్టం పడాల్సిందే

తిరుమలయ్య : మీ రమణయ్య ఉన్నాడు కదరా! వాణ్ణి పంపకపోయావా

వెంకటయ్య : ఆ కోతి కొమ్మచ్చిలాడుకోవడం తప్ప ఇంటిధ్యాస లేదువాడికి

తిరుమలయ్య : వాడేమిటి, ఈ టేకులపెంటలో కుర్రకారంతా ఇంతే

వెంకటయ్య : "ఒరే రమణా! మనవి పూరిపాకల్రా, గడ్డి ఎండిపోయింది కర్ర పుచ్చిపోయింది. ఎండాకాలం అయితే అగ్గిభయం, వానాకాలం అయితే గుడిసె కూలి ఈ కొండల్లో బండల మీద ఉండాల్రా" అని చెవినిల్లు కట్టుకుని చెప్పేన్రా, వింటేనా.

వెంకటయ్య : ఈ కుర్రకారుని ఆ దేవుడే మార్చాలి. మనవశం కాదు. అన్నా జాగ్రత్తగా దిగురా.

ఈశ్వర్ : ఆ బింది ఇలాతే అన్నా

వెంకటయ్య : తమరెవరు బాబూ

తిరుమలయ్య : సాయిబాబా పిల్లలన్నా! వారం వారం డాక్టర్లని మందులిప్పిస్తున్నారే వాళ్లు. నమస్కారం అయ్యా.

సారథి : నమస్కారం

ఈశ్వర్ : సాయిరాం

వెంకటయ్య : ఎవరెవరో వచ్చారు. కతలు చెప్పి పోయారు. కాని మా కష్టాలు తీర్చలేదు.

సారథి : కాని, మా బాబా కష్టాలు తీర్చేవారు. అందుకే మమ్మల్ని పంపారు. ఆ బిందె

ఇలాతే మన పిల్లలు నీరు తెస్తారు. పద ఇంటికి

వెంకటయ్య : మరి నా బిందో

ఈశ్వర్ : ఎవ్వరూ అఖ్ఖరలేదు. లోయలో పంపుపెట్టి గ్రామానికి గొట్టాలు వేస్తాం. ఇక్కడ కుండీ కట్టి ఆ గొట్టాలు కలుపుతాం. కుండీకి నాలుగు కుళాయిలు బిగిస్తాం. అంతే కొళాయి తిప్పితే నీ ఇంటిముందే నీరు పట్టుకోవచ్చు.

వెంకటయ్య : ఒరే తిరుమలయ్యా ఇక్కడ కుళాయి తిప్పితే వాగులో నీరెట్టా వస్తుందిరా.

తిరుమలయ్య : అన్నా లోయలో వాగు దగ్గర పంపుపెడతార్రా. అక్కడ మీట నొక్కితే ఝూమ్మని పైపుల్లోంచి పరుగెత్తుకొచ్చి నీరు ఈ కుళాయిలోంచి పడుతుంది రా. పట్నంలో నేను చూశాన్లే.

వెంకటయ్య : ఇది కొండ దేవత వరం కాదు కదా.

ఈశ్వర్ : కొండదేవత వరం కాదన్నా కొండంత దేవుడు! మా బాబా వరం.

వెంకటయ్య : సాయిబాబా పిల్లలూ!

సారధి : చెప్పన్నా!

వెంకటయ్య : ఈ కొండల్లో పుట్టాం ఈ బండల మీద పెరిగాం. చదువూ సంధ్యా లేదు మాకు. ఇక్కడి గడ్డితోనే గుడిసెలేసుకున్నాం. ఎండలొస్తే మండిపోతాయి. గాలొస్తే ఎగిరిపోతాయి. కొందరికి చెప్పేం. చూస్తామన్నారు. కాని చూసిన జాడలేదు. విసిగి వేసారి పోయాం.

ఈశ్వర్ : బాధపడకన్నా! నువ్వడగవలసిన అవసరమే లేదు. ఇక్కడ మీ అందరికీ ఇళ్ళే కాదు గుడిని, బడినీ కూడా కట్టించి ఇమ్మని మమ్మల్ని మా బాబా వారే పంపించారు. మీ గ్రామంలో 21 కుటుంబాలకీ ఇరవై ఒక్క ఇళ్ళు తయారవుతాయి.

తిరుమలయ్య : నిజమే! బాబాకు కోటి దండాలు బాబూ. కాని ఈ కొండలమీదికి మనుషులు రావడమే కష్టంగా ఉంటే సిమెంటు, ఇనుపచువ్వలూ ఎలా వస్తాయయ్యా. ఇక్కడ ఇళ్ళెలా కడతారయ్యా! సాధ్యం కాదే.

ఈశ్వర్ : 'సాయిరాం, సాయిరాం' అని బాబాని తలుచుకుంటూ పనిచేస్తే కష్టమంతా దూదిపింజలా ఎగిరిపోతుందయ్యా. అన్నీ అలవోకగా అమరిపోతాయయ్యా! నువ్వే చూస్తావుగా.

వెంకటయ్య : బాబాకి మా మీద ఎంత దయ.

సారధి : వారికి మీ మీదే కాదు. అందరూ వారి బిడ్డలే. ఎవరన్నా వారికి ప్రేమే. ప్రపంచంలో ఏ కులమైనా, మతమైనా, దేశమైనా అందరి ముఖాల్లో చిరునవ్వులు చిందించడమే వారి లక్ష్యం.

(సాయి యువత నృత్యం చేస్తుండగా ఇళ్లు నిర్మాణం జరుగుతుంది)

పాట

పల్లవి. ప్రతి రెమ్మలోన ప్రతి కొమ్మలోన
ప్రతి పూవులోన ప్రతి నవ్వులోన
ప్రతి పలుకులోన ప్రతి పిలుపులోన
ప్రతి మనిషిలోన ప్రతి మనసులోన
కొలువై ఉన్నది సాయిరూపం
నెలవై ఉన్నది జ్ఞానదీపం
జగమంతా సాయిమయం – 6 ॥ప్రతి॥

చ. 1 ప్రత్యూష కిరణాల వెలుగులలోన
తారా తోరణాల జిలుగులలోన
ఏడురంగుల ఇంద్రచాపంలోన
నిశిరాత్రుల వెలిగే వెన్నెలదీపంలోన
కొలువై ఉన్నది సాయిరూపం
నెలవై ఉన్నది జ్ఞానదీపం
జగమంతా సాయిమయం – 6 ॥ప్రతి॥

చ. 2 మోహనరూపమై మీరా మదిలోన
బృందావన గీతమై రాధమువ్వలలోన
వెన్నెలవానల యన్నమయ్యపదములలోన
అమృతధారల త్యాగయ్య కీర్తనలలోన
నెలవై ఉన్నది జ్ఞానదీపం
జగమంతా సాయిమయం – 6 ॥ప్రతి॥

చ. 3 మురిపించు వాద్యాల నాదంలోన
వెలిగించు హృదయాల వేదంలోన
పిలిచేటి నిను తలచేటి నీ ఆవాహనంలోన
కొలిచేటి మైమరచేటి నీ ఆరాధనంలోన
కొలువై ఉన్నది సాయిరూపం
నెలవై ఉన్నది జ్ఞానదీపం
జగమంతా సాయిమయం – 6 ॥ప్రతి॥

(సన్నాయి మేళం. వేదపఠనం జరుగుతుంది)

| | |
|---|---|
| ఈశ్వర్ | : వెంకటయ్యా ఈ కుళాయి తిప్పు నీరు వచ్చేస్తుంది. (వెంకటయ్య తిప్పుతాడు, నీరొస్తుంది.) |
| సారధి | : జై బోలో భగవాన్ శ్రీసత్యసాయిబాబాజీకి |
| అందరూ | : జై |
| ఈశ్వర్ | : తిరుమలయ్యా నువ్వీ ఇంట్లో గృహప్రవేశం చెయ్యి (వేదమంత్రాలు చదువుతూండగా గృహప్రవేశం చేస్తాడు తిరుమలయ్య) |
| సారధి | : జై బోలో భగవాన్ శ్రీసత్యసాయిబాబాజీకి |
| అందరూ | : జై |
| వెంకటయ్య | : సాయిరాం బాబుగారూ! మాకు ఇళ్ళిచ్చేరు. నీరిచ్చారు గుడీ, బడీ కట్టించారు. బాబాకు ఏమిచ్చి మా ఋణం తీర్చుకోగలం. |
| ఈశ్వర్ | : ఏమీ ఇవ్వనవసరంలేదు 'సాయిరాం' అని స్మరణ చెయ్యండి. మీకున్న దురలవాట్లు మానండి. మంచిగా జీవించండి చాలు. |
| వెంకటయ్య | : చాలా సంతోషం బాబూ తప్పక చేస్తాం. బాబూ! గుంతపల్లి గ్రామంలో కూడా మాలా బాధపడుతున్న వారు చాలామంది ఉన్నారు బాబూ! వారికీ ఇలాంటి సాయం అందించగలరా! |
| ఈశ్వర్ | : వెంకటయ్యా! గుంతపల్లిలో అరవైనాలుగు ఇళ్ళూ, మంచినీటివసతీ, పాయలపల్లెలో బడీ, మెట్టుపల్లెలో మంచినీటి వసతీ మీ గ్రామం కంటె ముందుగా ఏర్పాటు చేసారయ్యా బాబా. |
| వెంకటయ్య | : ఆ! నడిచి కూడా చేరలేని ఈ గ్రామాలకు కూడా ఇళ్ళూ, నీటివసతీ ఏర్పాటు చేశారా. బాబా! నీకు వేల వేల వందనాలయ్యా. |
| ఈశ్వర్ | : వెంకటయ్యా! ఉండడానికి ఇల్లూ త్రాగడానికి నీరూ అమరాయి. మరి మీ పిల్లలు మీలాగే ఈ కొండల్లో బండల్లా ఉండిపోవలసిందేనా. |
| వెంకటయ్య | : ఏం చెయ్యగలమయ్యా. చదువుకోసం దూరాభారం పిల్లలు నడవలేరు కదా! ఇక్కడ మేకల్ని కాసుకుంటారు. |
| రమణ | : నేను మేకల్ని కాయనయ్యా. |
| తిరుమలయ్య | : కాయకురా! కలకటేరువో, రాష్ట్రపతివో అయిపోదు గాని |
| ఈశ్వర్ | : ఏం ఎందుక్కాకూడదు పేదకుటుబంలో పుట్టి పేపర్ల అమ్ముకున్న కలాం రాష్ట్రపతిగా ఎందరో పిల్లలకి ప్రేమను పంచి బాబా హృదయంలో చోటు |

సంపాదించుకోలేదా? మీ వారిని తీర్చిదిద్దే బాధ్యత బాబాకు వదలి పెట్టండి. వారి ఆశీస్సులతో మీ పిల్లలు ప్రహ్లాదుల్లా మారుతారు.

తిరుమలయ్య : అన్నా! పంపమంటావా

వెంకటయ్య : తమ్ముడూ! మనకి ఉండడానికి ఇల్లిచ్చి, త్రాగడానికి నీరిచ్చిన భగవంతుడి దగ్గరికి పంపడానికి ఆలోచనేమిట్రా, పంపండి.

(ప్రేమ ఈశ్వర్‌హై పాట వినిపిస్తుండగా అందరు నిష్క్రమిస్తారు. వేదం చదువుతూ 'సంస్కారజ్యోతి' పిల్లలు ప్రవేశిస్తారు)

వెంకటయ్య : తిరుమలయ్యా! వీళ్ళు మన పిల్లలే! అయ్యవార్లు చదివే మంత్రాలు ఎంత చక్కగా చదువుతున్నారో చూడు. సంవత్సరకాలంలో ఎంత మార్పురా.

తిరుమలయ్య : బాబా! నువ్వు దేవుడివి కాదయ్యా దేవాది దేవుడివయ్యా

రాజు : సారథీ, ఇదంతా చూస్తుంటే కలలా అనిపిస్తోంది. అనూహ్యమై అసాధ్యమనుకున్న వాటిని సుసాధ్యం చేశారయ్యా బాబా. అసలీ కొండల్లో, అడవుల్లో ఆరు నెలల్లో ఇళ్ళు కట్టే అద్భుతాన్ని ఎవరైనా ఊహించగలరా.

సారథి : మా బాబా చేసే ప్రతిపనీ ఒక అద్భుతమే. ఆ గిరిజనుల ముఖాల్లో ఆనందం, వారి కళ్ళలో ప్రతిఫలించే ఆకాంతీ చూడు ఎన్నికోట్లు సంపాదిస్తే ఈ సంతృప్తీ, ఈ ఆనందం లభిస్తాయి. నువ్వే చెప్పు.

సుందరం : నువ్వన్నది నిజం సారథీ. మేమూ సత్యసాయి ప్రేమవాహినిలో పయనించాలని నిశ్చయించుకున్నాం.

హరి : మా ఉద్యోగ వ్యాపారాల్లో చేరే ముందు ప్రశాంతినిలయంలో వారి దర్శనం చేసుకుని వారి పాదాలసాక్షిగా సేవామార్గంలో పయనిస్తామని వారి ఎదుట ప్రమాణం చేస్తాం.

సారథి : బాబా ఆశీస్సులు మనకెప్పుడూ ఉంటాయి. పదండి మనందరం వారి దర్శనం చేసుకుందాం.

(అందరి దేవుడు నేపథ్యంలో వినిపిస్తూ ఉండగా నాటకం ముగుస్తుంది)

---000---